క్లుప్తంగా

క్రీడాస్ఫూర్తితో విజేతలుగా నిలవాలి

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న హరికృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడి క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పాలడుగు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల మ్యాచ్ బాల్ ఇన్విటేషన్ క్రికెట్ పోటీలను నిర్వాహకుడు పాలడుగు రాజీవ్ మౌనిక దంపతులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ ఇన్విటేషన్ క్రికెట్ పోటీల్లో సుమారు రూ.2 లక్షల వరకు ప్రైజ్ మనీ అందించడం నిర్వాహకులకు క్రీడాకారులపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. అనంతరం తొలి మ్యాచ్‌లో తలపడిన రాజస్థాన్ రాయల్స్ (ఒంగోలు) – సంతనూతలపాడు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఒంగోలు జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో తిరుపతి, పేర్నమిట్ట జట్లు తలపడగా తిరుపతి జట్టు విజయం సాధించింది. ప్రారంభోత్సవంలో పాలడుగు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

రాచర్ల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీ నాయక్ హెచ్చరించారు. మండలంలోని అనుములపల్లె, రాచర్ల గ్రామాల్లో విత్తనాల షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాల స్టాక్ రిజిస్టర్, బిల్ పుస్తకాలను పరిశీలించారు. రైతులకు విత్తనాలు అమ్మిన సమయంలో తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని వివరించారు. బిల్లులు లేకుండా పురుగుమందులు, విత్తనాలను రైతులకు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని వివరించారు. వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

జూన్ 8 నుంచి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం టౌన్: వచ్చే నెల 8 నుంచి 12వ తేదీ వరకు మార్కాపురం పట్టణంలోని నాయీ బ్రాహ్మణ మాన్యంలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చైర్మన్ రావిపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్ శివశంకర్, అదనపు కార్యదర్శి నిట్టూరి వెంకట రమేష్ తెలిపారు. 8న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 9న ధ్వజారోహణం, అనంతరం శేషవాహనంపై స్వామి వారి దర్శనం, 10వ తేదీన హనుమంత వాహనంతో పాటు స్వామివారి కళ్యాణంతో పాటు రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి రూరల్: జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మినీ జాబ్‌మేళా కార్యక్రమం జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి టి. భరద్వాజ్ అధ్యక్షతన నిర్వహించారు. జాబ్‌మేళాకు 109 మంది హాజరు కాగా 29 మంది ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ఉషారాణి, ప్లేస్‌మెంట్ అధికారి బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ బాలకృష్ణా, కో ఆర్డినేటర్ భాస్కర్, ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మెమోలు ఇచ్చినా సమావేశానికి రారా?

- సమస్యలకు పరిష్కారాలు ఎలా దొరుకుతాయి?
- మెమోలు ఇవ్వాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: మెమోలు జారీ చేసినా సర్వసభ్య సమావేశాలకు రారా.. ఏదైన ముఖ్యమైన పనులు ఉంటే ఇక్కడ చర్చించిన తరువాతనే వెళ్లాలి అని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో కొన్ని పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు మాట్లాడుకోవడం లేదని.. ఇలా అయితే పరిపాలన ఎట్లా సాగుతుందని.. చెక్కువులపై సంతకాలు ఎవరు పెడతారని ప్రశ్నించారు. రాజుపాలెంలో రొయ్యల ఫ్యాక్టరీ నిర్మించడం వలన గ్రామానికి హాని కలుగుతుందని దానివలన ఎన్నో అనార్థాలు ఉన్నాయని ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు, ఉప్పుటూరి కోటేశ్వరావు ఎంపీపీ దృష్టికి తీసికెళ్లారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ 03 డిసెంబర్ 2020న పంచాయతీ తీర్మానం ఉందని దానికి సంబంధించిన కాగితాలు ఇంతక ముందు కార్యదర్శిగా చేసిన తన్నీరు శ్రీనివాసరావు దగ్గర ఉన్నా.. ఇవ్వటం లేదని చెప్పారు. కార్యదర్శి దగ్గర రొయ్యల ఫ్యాక్టరీకి సంబంధించిన తీర్మానాలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. జలజీవన మిషన్ కింద రెండేళ్ల క్రితం స్పెషల్ అధికారులు ఉన్నప్పుడు ఎస్టిమేషన్ వేసిన ప్రకారమే మంజూరయ్యాయని ప్రస్తుతం పనులు జరగనీయాలని కోరారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా గ్రావెల్ రోడ్లు 119 మంజూరు కాగా 3 పూర్తి చేయటం జరిగిందని మిగతావి వెండర్ సిస్టం ద్వారా రోడ్లు వేసుకునే పద్ధతి తీసుకురావలని జిల్లా అధికారుల దృష్టికి తీసికెళ్లాలని ఏపీవో రత్నజ్యోత్స్నను ఆదేశించారు.

తాగునీరే ఇవ్వలేకపోయారు

రెండేళ్ల నుంచి ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ కార్యాలయాలకు నీరు ఇవ్వలేకపోయారని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి మండిపడ్డారు. తాగు నీరు, వాడుకోవడానికి నీరులేక ఎన్నో ఇబ్బందులు



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

పడుతున్నారని వెంటనే నీరు వచ్చే విధంగా పైపులు వేయాలని కోరారు. నాడు–నేడు పాఠశాలలు సక్రమంగా జరగటం లేదని, లోకల్ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలు తెలియకుండా పనులు చేస్తున్నారని సమావేశంలో మండిపడ్డారు. నాడు–నేడు ప్రత్యేక అధికారి ఏఈ రామ్మోన్ కలెక్టర్ కూడా ఫిర్యాదు ఇచ్చానని శాఖ పరమైన చర్యలు తీసుకోవాని తెలిపారు. ఈతముక్కలలో రెండు పాఠశాలలను సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియకుండా పడగొట్టారని, ఏఈపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో డాక్టర్ సుజాత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేసి పేదలకు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద రూ.2.99 కోట్లు మంజూరు చేశారన్నారు. మూడు సహజ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ, మౌలిక సదుపాయాల కార్యాచరణ కమిటీ, మానవ వనరుల యాజమాన్య కార్యచరణ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. రాజుపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ప్రయివేటు పాఠశాలలున్నాయని కొన్నిటికి పర్మిషన్లు లేవని, ఉన్న వాటికి యూరిన్, మరుగుదొడ్లు సక్రమంగా లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని ఎంఈవో అజయ్ బాబు దృష్టికి తీసికెళ్లారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ సమావేశానికి అధికారులు ఎవరూ ఉండటం లేదని, మన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని చర్చించారు. ఆర్టీసీ సిబ్బంది ఒంగోలు నుంచి కొత్తపట్నం వరకు ఎక్కువ చార్జీలు వసువులు చేస్తున్నారన్నారు. డాక్టర్ వైష్ణవి, శివపార్వతి, ఏపీఎం రజియా సుల్తాన్‌బేగం, ఈశ్వరరెడ్డి, విద్యుత్ ఏఈ వీరాంజనేయులు, ఎంఈవో అజయ్‌బాబు, సీడీపీవో రాజకుమారి, ఎఫ్‌డీవో ఆశ, పశు వైద్యాధికారి అనూష, కోఆప్షన్ సభ్యుడు బాజీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అందుబాటులో ప్రభుత్వ వైద్యం

- సద్వినియోగం చేసుకోవాలన్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించాలన్న సంకల్పంతో అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి, ఎఫ్‌డీసీ కో ఆర్డినేటర్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతిఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో పేదలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ అన్నారు. వైద్యశాఖలో ఖాళీలు లేకుండా ప్రతి గ్రామానికి విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వాటిలో మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లను నియమించారన్నారు. విద్య, వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టాన్నారు. ప్రతి ఒక్కరి మేలు కోరుతూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా నిలవాలని ఆమె కోరారు. జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి, ఎఫ్‌డీసీ కో ఆర్డినేటర్ రమేష్ మాట్లాడుతూ మద్దిపాడు మండలంలో 55 వేల మంది జనాభా ఉన్నారని, వారందరికీ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఇనమనమెళ్లూరులో మరో పీహెచ్‌సీని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రెండు పీహెచ్‌సీలకు రెండు



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి రమేష్

104 వాహనాలు, నలుగురు డాక్టర్లు వచ్చారని, వారి ద్వారా మండలంలోని ప్రజలకు వైద్యం అందించేందుకు వైద్యశాఖ సిబ్బంది కృషి చేస్తున్నారని వివరించారు. గ్రామాల్లో ఎఫ్‌డీసీ కార్యక్రమం నిర్వహించే సమయంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీతో వైద్యశాఖ సిబ్బంది మాట్లాడి వారి సహాయ సహకారాలు తీసుకుని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి విషయాన్ని సంబంధిత గ్రామ సర్పంచ్‌కి, పార్టీ నాయకులకు తెలిపితే వారు అండగా నిలుస్తారని తెలిపారు. ఎఫ్‌డీసీకి సంబంధించిన షెడ్యూల్‌ను గ్రామ కార్యదర్శులందరికీ అందించాలని వైద్యశాఖ సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, ఆస్పత్రి డాక్టర్ జగదీష్, మద్దిపాడు సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయస్వామి

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వేదపండితులతో అభిషేకాలు, ఆకుపూజ, శాంతి హోమం చేశారు. గ్రామ మహిళలు సామూహిక నైవేద్యం చేసి స్వామి వారికి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. మంగళవారం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం ఆంజనేయస్వామి కల్యాణం

కొనకనమిట్ల: హనుమాన్ జయంతి, అభయ వీరాంజనేయ స్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సువర్చలా సహిత అభయ వీరాంజనేయస్వామి కల్యాణం భక్తుల కోలాహలం నడుమ వైభంగా నిర్వహించారు. స్వామివారికి గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న మహిళలు

డెంగీ లేని మండలంగా తీర్చిదిద్దాలి

కొత్తపట్నం: డెంగీ జ్వరం లేని మండలంగా తీర్చిదిద్దాలని డాక్టర్లు ఎం. వైష్ణవి, శివపార్వతి, పి.హేమంత్ కుమార్ అన్నారు. డెంగీ జాతీయ దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తపట్నం, ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ డెంగీ జ్వరం ఎక్కువగా దోమలు వలన వస్తుందన్నారు. మన గ్రామం పరిశుభ్రంగా ఉంటే మన ఇళ్లు శుభ్రంగా ఉంటుందన్నారు. దోమలు పుట్టకుండా చూచుకోవాలని వివరించారు. ఒక వేళ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రందించాలని చెప్పారు. కొత్తపట్నంలో పీహెచ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ అక్కడ నుంచి శివాలయం వీధి, ఈతముక్కల బజారు వరకు నినాదాలు చేసుకుంటూ డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో ఓంకార్, నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాలి

ఒంగోలు అర్బన్: డెంగీ వ్యాధిపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన ర్యాలీలు కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ డెంగీ విజయోత్సవ ర్యాలీని ప్రకాశంభవనం వద్ద



కొత్తపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ డెంగీ విజయోత్సవ ర్యాలీలు జిల్లా అంతటా నిర్వహించాలన్నారు. డెంగీ వ్యాధి లక్షణాలపై ప్రజలకు తెలియచేసి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చైతన్య పరచాలన్నారు. డ్రైడే, ఫ్రైడే వంటి కార్యక్రమాలను విధిగా అమలు చేయాలన్నారు. దీనిలో మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, క్షయ నివారణ అధికారి సురేష్ ఇతర అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రీడీ మ్యాపింగ్‌తో గుండె చికిత్స



గుండె దడకు చికిత్స అందించిన విధానాన్ని తెలుపుతున్న కిమ్స్ హాస్పిటల్ వైద్యులు

ఒంగోలు అర్బన్: గుండె విద్యుత్ ప్రసరణ వ్యవస్థ సమస్యలను అధికమించేందకు కిమ్స్ ఆసుపత్రిలో త్రిడీ మ్యాపింగ్ పద్ధతిని ఉపయోగించి కచ్చితమైన గుండె విద్యుత్ ప్రసరణలో సమస్యలను తెలుసకుని గుండె చికిత్సలు చేస్తున్నట్లు కిమ్స్ ఎలక్ట్రో ఫిజియాలజీ నిపుణులు డాక్టర్ ఆనంద్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుండె దడ సమస్యలను తేలిగ్గా తీసుకోకుడదని గుండెకు విద్యుత్ ప్రసరణ వ్యవస్థ ఉంటుందన్నారు. దీనిలో సమస్యలున్నా గుండె దడ నిరంతరంగా ఉంటుందన్నారు. ఈ సమస్యతో బాధపడుతున్న 6 మందికి అత్యాధునిక త్రిడి మ్యాపింగ్ పద్ధతిలో కచ్చితమైన సమస్య నిర్ధారణ చేసి చికిత్స అందించామన్నారు. రోగులు కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని చికిత్స చేయించుకున్న వారిని విలేకర్ల సమావేశంలో వారి అనుభవాలను తెలియచేశారు. దీనిలో కిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరి రెడ్డి, కార్డియాలజిస్టులు డాక్టర్ ఆనంద్, హరీష్, కపిల్, కార్తీకయరెడ్డి, కార్డియో థొరాసిక్ వ్యాస్కులర్ సర్జన్ లక్ష్మణ్‌రెడ్డి, సీఓఓ అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జవహర్, ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తిలోని కొత్త కుమ్మరి పాలెంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, ఎస్సై జీ రామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ యూత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ఒంగోలు రూరల్: మండల సర్వసభ్య సమావేశం 20న జరగనున్నట్లు ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో ఒంగోలు మండల ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొననున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు వారి ప్రతినిధులు కాకుండా స్వయంగా సమగ్ర పూర్తి సమాచారంతో మండల సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

వైద్య వృత్తి పవిత్రమైనది

ఒంగోలు రూరల్: అన్నింటికన్నా వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జున రెడ్డి అన్నారు. కరవది పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన అభివృద్ధి మండలి సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కరోనా అనంతరం వైద్యశాలల అభివృద్ధి గ్రామాల్లో సీహెచ్‌వోల ఏర్పాటుతో పాటు సీహెచ్‌సీల నిర్మాణం చేస్తోందన్నారు. అంకితభావంతో ప్రతి ఉద్యోగి పనిచేయాలని అప్పుడే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. సర్పంచ్ డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన పీహెచ్‌సీ భవనానికి.. రోడ్డును ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చేజర్ల వెళ్ళే మంచినీటి పైపు లైన్ నిర్మించనున్నట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి మాట్లాడుతూ నూతన భవనంలోకి వెళ్ళేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డాక్టర్ సుందర్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సౌకర్యాలు కల్పించే అంశంపై అవగాహన కల్పించారు. డెంగీ బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, చర్యలు గూర్చి వివరించారు. ఎం.శ్రీనివాసరావు, పి.హెచ్.సి సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎలిజబెత్, పి.హెచ్.సి అధికారులు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన వ్యక్తి మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన ఎఫ్రాహిం

కొత్తపట్నం: ఈ నెల 14న తను కుటుంబ సభ్యులతో కొత్తపట్నం బీచ్‌కు వెళ్లి స్నానం చేస్తుండగా మునిగిన యువకుడు చికిత్స అనంతరం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ముండ్లమూరి మండలం, చింతలపూడి గ్రామానికి చెందిన రాచపూడి ఎఫ్రాహిం (19) చీమకుర్తి మండలంలో బూచేపల్లి ఇంజినీరింగ్ కాలేజీ బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో తను బంధువులతో సముద్ర స్నానానికి వెళ్లారు. బట్టలు ఒడ్డున పెట్టి సముద్ర స్నానానికి దిగగా.. ఒక్కసారిగా అలలు ఉధృతంగా రావడంతో గల్లంతయ్యాడు. సోదరి మేరీ స్వరూప, తమ్ముడు పీటర్‌సన్ పెద్దగా కేకలు వేయగా మెరైన్ పోలీసులు అతి కష్టం మీద ఎఫ్రాహింను ఒడ్డుకు చేర్చారు. 108 ద్వారా ఒంగోలు ప్రయివేటు హాస్పిటల్‌కు చేర్చారు. ఒక్క రోజు అనంతరం తమ వల్ల కాదని డాక్టర్లు చేతులెత్తాశారు. గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు తీసికెళ్లాలని డాక్టర్లు చెప్పారు. సోమవారం అర్ధరాత్రి అంబుల్స్ ద్వారా గుంటూరు హాస్పిటల్‌కు తీసికెళ్లి డాక్టర్లు పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్సై సాంబశివరాలు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.